
# దగా పడిన కోయిల!



"ఏనాటికీ రాడు
ఏలాటి ప్రియుడే
ఈలాగు వేచి నే వెన్నాళ్లు
సైచేనే"

కమ్మటి స్వరలహరులు గాలిలో అలలలలుగా తేలివచ్చి నా నిద్రను మేల్కొల్పాయో, లేక, నేను మేల్కోబోతున్నప్పుడు ఆ పాట వినిపించిందో సరిగా చెప్పలేదు.

ఎంత మధురమైన స్వరమది! అమృతం చిలికించే రవళది. కళ్లు విప్పకుండా వింటూంటే గొప్ప అనుభూతి కలుగుతోంది. ఎప్పుడో, ఎక్కడో విన్నట్టున్న ఆ స్వరం ... ఏవో జ్ఞాపకాల్ని రేపుతోంది.

కలగాపులగంగా వస్తున్న స్మృతులని మెదడు ఒక క్రమంలో పెట్టలేకపోతోంది.

రైలు కుదుపులకు ఊయలలూగుతున్నట్లుంది. ఒక పక్క లయగా

గోరుసు జగదీశ్వరరెడ్డి

వినిపిస్తున్న రైలు శబ్దం, మరోవక్క ఆపాతమధురగానం...

ఎవరై ఉంటారు? ఇంత తెల్లవారుజామున పాడటం ఏమిటి?

"తాను వచ్చేదారి
నా ప్రేమ చల్లీ
ద్వారాన చూపుల తోరణాలల్లీ
ఎన్నాళ్లు నా కళ్లు ఎదురు చూసేనే
ఈలాగు ఈ విరహ బాధ మోసేనా ..."

ఆ కంఠంలో ఎంత భావోద్వేగం ... ఎవరైనా తెలుగు పాటల్ని టేపురికార్డర్‌లో వింటున్నారా ... ఎంతో గొప్ప అభిరుచి ఉంటేనో తప్ప ఈ సాహిత్యాన్ని ఆస్వాదించలేరు కదా!

మళ్లీ ఎన్నాళ్లకు విన్నా నీ పాటని! చిన్నతనంలో ఎప్పుడో విన్న జ్ఞాపకం. కృష్ణశాస్త్రి సాహిత్యం నాన్న చాలా ఇష్టపడేవాడు. చెలికాని కోసం నిరీక్షించే చెలి హృదయ వేదనని ఆయనంత గొప్పగా మరే కవీ అర్థం చేసుకోలేదనేవారు.

"కొమ్మల గువ్వలు గుసగుస మనినా
రెమ్మల గాలులు రుసురుసురనినా!"

ప్రతి చిన్న కదలికలకీ ఆత్రుతతో ఎదురు చూసే ప్రియురాలి గుండె భారం ...

"గడియయేని ఇక విడిచిపోకుమా
ఎగసిన హృదయం పగలనీకుమా!"

ఆమె గుండెని తన గుప్పిట్లో ఉంచుకున్నంత అవలీలగా రాయగలిగేది ఒక్క కృష్ణశాస్త్రేనేమో!

నా చిన్నతనంలో సాహిత్యం, సంగీతం రెండూ ఇంట్లో రాజ్యమేలేవి. నాన్న కా రెండూ ఆరో ప్రాణాలు. ఇంటినిండా గ్రామఫోన్ రికార్డులు, షెల్ఫ్‌ల్లో ఎన్నో సాహితీ గ్రంథాలు, వచ్చీపోయే కళాభిరుచున్న మిత్రులు ... సాహితీ చర్చలు అంతా కోలాహలంగా ఉండేది.

"మీకంత గొప్ప అభిరుచి ఉంటే పెళ్లెందుకు చేసుకున్నారు? మాకన్నా ఈ సంగీతమూ, పుస్తకాలూ మీ లోకమైపోయాయి. వాటితోనే గడిచిపోతోంది మీకు..." అప్పుడప్పుడూ సరదాగా అమ్మ అనే మాటలకు నాన్న పెదాలపై చిరునవ్వు వెలిసేది. వెంటనే తన జగత్తులోకి వెళ్లబోతూ గ్రామఫోన్ రికార్డు వేసేవారు.

"సామవేదసారము
సంగీతము, సాహిత్యమేగా ..."

తన్మయత్వంతో వింటూ సాలూరి రాజేశ్వరరావు గొంతుతో తనూ శ్రుతి కలుపుతూ

"పాట పాడుమా కృష్ణా
పలుకు తేనెలొలుకు నటుల
మాటాడుమా ముకుందా
మనసు తీరగా..."

నాన్నకి స్వర్ణమాల పాటలంటే చాలా ఇష్టం. ఆమె స్వరంలో సరస్వతి నెలవై ఉందనేవారు. ఆమె పాడిన ప్రైవేటు రికార్డులు, సినిమా పాటలూ, జానపద పాటలు, ఎంకి పాటలు ... ఎన్నో గ్రామఫోన్లు ఉండేవి ఇంట్లో.

స్వర్ణమాల పాటల్తోపాటే రావు బాలసరస్వతీ, రాజేశ్వరరావు, బాలమురళి, శ్రీరంగం గోపాలరత్నం, భానుమతీ ... ఘంటసాల వరకూ అందరివీ వింటూ రసానుభూతి చెందేవారాయన.

నాన్నగారికున్న అభిరుచి మాకూ కొంచెం అబ్బిందనే చెప్పాలి.

రైలు ఒక్కసారిగా కీచ్‌మన్న శబ్దం చేస్తూ ఆగటంతో ఉలిక్కిపడి కళ్లు తెరిచాను. అంతవరకూ ఎవరు పాడుతున్నారో, ఎక్కడ్నుండి ఆ పాట వినిపిస్తోందో ... తెలీకుండానే పాట దూరమైపోయింది.

జనం హడావుడిగా సామాన్లు సర్దుకుంటూ, లెక్క చూసుకుంటున్నారు.

## శ్రీరాగం



ఈ రోజు ఉదయం
వినిపించలేదు నాకు
పంచాంగశ్రవణం-కాని
వినిపించింది
రాజ్యాంగశ్రవణం
తల్లీ సరస్వతీ! నేడు భారతావనిలో
జన్యరాగాలే మేళకర్తల స్వరూపాన్ని
మార్చేస్తున్నాయి,
బిలహరి రాగాన్ని బిహారీ రాగంగా-
అతల్‌బిహారీ రాగంగా మారుస్తారేమోనన్న
ఆందోళన
అరభిరాగ మూర్ఛాన్నే
అద్వానీరాగస్వరూపంగా మారుస్తారేమోనన్న
ఆవేదన
జననీ సరస్వతీ! నీ రాగస్వరూపంతో
సర్వకళాసారంతో ఈ ప్రయత్నాలకి పాడమ్మా
శ్రీరాగం!!
అదే మాకు నీవిచ్చే క్రమం తప్పని
విక్రమం!

ఆచార్య రాంభట్ల వెంకట్రావు

"వచ్చేది 'థానే' స్టేషన్. తర్వాత విక్రోలి, ఘట్‌కేసర్‌లు. వాటిల్లో రైలు ఆగదు. తర్వాత వచ్చే దాదర్‌లో దిగితే వెనక్కి రావటం కష్టం. సామాన్లు సర్దేయ్! వచ్చే స్టేషన్‌లో దిగిపోదాం!" నాతోపాటే ఉన్న మా బాస్ మాటలకి పై బెర్త్ మీద నుండి దిగి, బట్టలు మార్చుకున్నాను.

లుంగీని మడతబెట్టి, స్లిప్పర్లని కాగితంలో చుట్టేసి, ఎయిర్‌బాగ్‌లో కుక్కేసి షూ వేసుకోసాగాను.

ముంబాయి నగరం మధ్యలో రైలు జోరుగా వెళ్తోంది. నేను ముంబాయి రావటం అదే తొలిసారి. మా పక్కనుండి వెళ్తున్న లోకల్ రైళ్లను చూస్తుంటే మతిపోతోంది నాకు. పొడుగాటి జీళ్లపాకానికి నిండా అంటుకుపోయిన నువ్వుల్లా జనసముద్రం!

లోపల వీళ్లకు ఊపిరి ఆడే అవకాశం ఉందా ... అనే అనుమానం.

అంతవరకూ నే విన్న పాట ఎవరిదని వాకబు చేశాను.

"ఇంత తెల్లవారుజామునే పాటలు పాడుకుంటూ అడుక్కునేవాళ్లు బయల్దేరారు చూశారా! ఇప్పుడు పాడుకుంటూ వెళ్లిన ముసలమ్మ పూనే స్టేషన్లో ఎక్కినట్లు గుర్తు. లావెట్రీ డోర్ పక్కనే పడుకుంది. తెల్లవారుతూనే పాటలు పాడుతూ డబ్బులు దండుకోవటం మొదలెట్టింది. రైల్వే టీ.సీ. ఏ కంపార్ట్‌మెంట్‌లో నిద్రపోతున్నాడో ... ఇలా ముష్టివాళ్లంతా ఎక్కేస్తారు. మన సౌత్‌లో పర్వాలేదు గానీ ... నార్త్ వెళ్లే కొద్దీ ఈ మనుషులు రిజర్వేషన్‌లో దూరిపోతారు సుమండీ ...

"ఈ దేశంలో మనలాంటివారికి ఇల్లూ, డబ్బూ, బంగారం, బట్టలూ, పై చదువులూ కావాలి గానీ, చూడండీ ... ఈ ముష్టివాళ్లెంత హేపీగా జీవించేస్తున్నారో!" హైదరాబాదు నుండి నాతో వస్తున్న ఆ ప్రయాణీకుడి మాటలకు మనస్సు చివుక్కుమంది.

ముంబాయిలో తెలుగుపాట వినటమే గొప్ప విషయం.

ఆ పాటను ఆస్వాదించడం మాటటుంచి, అలా విమర్శించడం చిరాకు కలిగించింది. 'ముసలమ్మ అంటున్నాడు! అంత గొప్పగా ఎలా పాడగలుగుతోంది?' ఉదరపోషణకు అలాంటి సాహిత్యాన్ని, సంగీతాన్ని భాషరాని మనుషుల మధ్య వెదజల్లుతున్నందుకు ఆనందించాలో, విచారించాలో తెలియలేదు.

థానే స్టేషన్‌లో రైలు ఆగగానే గబగబా దిగిపోయాం. స్టేషన్‌నుండి బయటికి

వస్తున్నానే గానీ ... ఆ స్వరం నన్నింకా వెంబడిస్తూనే ఉంది.

ఎప్పుడో విన్న తలంపు ... వస్తూ, పోతూ ... పోతూ, వస్తూ ఉంది.

ఏది ఏమైనా బాగా పరిచయమున్న గళమది.

మేం ఆటోలో ఘట్‌కేసర్‌కి వచ్చి, ముందే బుక్ చేసుకున్న ఏర్‌లైన్స్ హోటల్లో దిగాము. అక్కడికి విక్రోలీలో ఉన్న గోద్రెజ్ కంపెనీ చాలా దగ్గర. అక్కడ జరగబోతున్న ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో మా కంపెనీ తరఫునుండి మా ప్రోడక్ట్ పెడ్తూ ఒక స్టాల్ తెరవబోతున్నాం.

దేశం నలుమూలలనుండీ ఎందరో ... వారి వారి ప్రోడక్ట్స్‌తో వచ్చారు. చాలా గొప్ప అనుభూతిని కలిగించిన ఎగ్జిబిషన్ చివరి రోజున మధ్యాహ్నం పర్మిషన్తో బయటపడ్డాను.

'దాదర్‌లో బట్టలు చౌకగా దొరుకుతాయని', నేను ముంబాయి వచ్చేముందు చెవిలో జోరీగల రొద పెట్టారు ఇంట్లోవాళ్లు. డబ్బులు ఎక్కువగా లేవు గనుక పిల్లలిద్దరికీ చెరొక రెండు జతలు తీసుకోవాలనుకున్నాను.

దాదర్‌కి వెళ్లడానికి లోకల్ ట్రైన్‌ని ఆశ్రయించక తప్పింది కాదు. టికెట్టు అయితే తీసుకున్నాను గానీ ... రైలు ఎలా ఎక్కడమా అన్నదే దడగా ఉంది.

ముందే ముంబాయిలో దొంగల భయం గురించి వినటంచేత డబ్బులున్న జేబుపైనే దృష్టి కేంద్రీకరించి, రైలు ఆగగానే ఒక కంపార్ట్‌మెంట్ వద్ద నిల్చున్నాను. రెప్పపాటులో సునాయాసంగా రైల్లో ఉన్నాను. లోపలికి ఎలా రాగలిగానో అన్న ఆశ్చర్యం నుండి తేరుకోకముందే ... రైలు స్పీడందుకుంది.

దాదర్‌లో దిగినప్పుడు కూడా క్షణాల్లో ప్లాట్‌ఫారంపై ఉన్నాను. ఏ అదృష్టశక్తో నాకు తోడ్పడలేదు కదా ... అనిపించింది.

'కళ్యాణ్ నుండి వస్తున్న లోకల్ ట్రైన్ వి.టి. వెళ్తోంద'న్న అనౌన్స్‌మెంట్ వింటూ దాదర్ స్టేషన్ బయటకి వచ్చాను.

బయట ఎన్నో సెకండ్‌హేండ్ వస్తువులు అమ్మటం కనిపించింది. ఒకరిద్దర్ని అడిగి బట్టలు అమ్మే చోటును తెలుసుకున్నాను.

పిల్లలకు చెరొక రెండు జతల్ని కొన్నాక, నాన్న ఎప్పుడూ చెబుతూండే మరాఠీ చిత్రం కాసెట్ కొనాలన్నది గుర్తుకు వచ్చింది.

'కేలా ఇశారా జాతా జాతా' ఎంతోసేపు ఆలోచిస్తే గానీ పేరు గుర్తుకు రాలేదు. దగ్గర్లో ఉన్న సెంటర్‌లో అడిగాను. ఆ మరాఠీ కుర్రాడు ముసిముసి నవ్వులు చిందిస్తూ కాసెట్ ఇచ్చాడు.

"అంత లోతైన అర్థం ఉందా ఆ సినిమా పేరుకు?" హిందీలోనే అడిగాను. 'పోతూ పోతూ సైగ చేశాడని' దాని అర్థమట.

'నీ సిగ్గు బంగారం గానూ ... మా తెలుగు సినిమా పేర్లని మరాఠీలోకి తర్జుమా చేసి వినిపిస్తే ... ఠారెత్తిపోవూ!' అనుకున్నాను.

చీకటి పడుతుండగా స్టేషన్‌లోకి వెళ్లాను. టికెట్ తీసుకుంటూండగానే వి.టి. నుండి వస్తున్న రైలుకోసం అనౌన్స్‌మెంట్ వినిపించింది. గబగబ ప్లాట్‌ఫారంకేసి అడుగులు వేయబోతున్న నేను ఒక్కసారిగా షాక్ తగిలినట్లు నిలబడిపోయాను.

"కావ్యపానము చేసి కైపెక్కి ఉన్నాను

దివ్య లోకాలెల్ల తిరిగొచ్చినానూ!" మెరుపు తీగలా సాగుతూ నన్ను అల్లుకుపోయిన ఆ స్వరం వినేసరికి ఒళ్లంతా గగుర్పొడిచింది. బసవరాజు అప్పారావు సాహితీ సంపద అది.

వెనక్కి తిరిగి చూశాను.

నాకు కొద్ది దూరంలో చిక్కి శల్యమైన తనువుతో, వంగిపోయిన ఒక ఆకారం కనిపించింది. ఆశ్చర్యంతో అలా చూస్తూ నిల్చుండిపోయాను.

నేను ముంబాయి వస్తున్నప్పుడు రైల్లో వినబడీ, కనబడకుండా పోయిన ముసలమ్మా, ఇప్పుడు నా ఎదుట ఉన్న భిక్షగత్తే ఒక్కరే నన్నది స్పష్టమైంది.

ఈ వయసులో ... ఎంత ధారాళత!

తడుముకోకుండా కమ్మగా, స్పష్టంగా,




తప్పుల్లేకుండా ఉచ్చరించి పాడడం ... ఇంత గొప్ప గాయని అలా అడుక్కుని బతకటం?!

తెలుగువాడిగా, ఆ క్షణంలో ఒకరకమైన సిగ్గుతో తల దించుకోవడం మనిషిగా నాలో కలిగిన స్పందనది.

గుండెపైని పెంకులన్నీ చెదిరిపోయే దృశ్యం.

ఒక్కసారిగా చిప్పిల్లిన నీటితో కళ్లు మసకబారినట్లు అయ్యాయి.

ఆమెకు దగ్గరగా వెళ్లి నిలుచున్నాను.

ఒక్కసారిగా ఒళ్లు జలధరించింది.

పూర్తిగా మాసిన, చింపిరి బట్టలు ... పీచు పీచు జుత్తు, చిరిగిన జోలి చంకలో వేలాడుతుండగా అర్ధనిమీలిత నేత్రాలతో పాడటమే తన ఊపిరైనట్టు పాడుతోంది.

ఆమె దగ్గర్నుండి ఒక రకమైన దుర్గంధం.

అంత గొప్ప సాహితీ సంపదని తన అద్భుతమైన గొంతులోంచి పాటగా మార్చుకుంటూ ... ఇంత దరిద్రంతో ఆమె బతకటం ... నన్ను నేను సంభాళించుకోలేక ... సతమతమవుతూ ఉన్నాను.

పాట సాంతం పాడి, అప్పుడు కళ్లు పూర్తిగా తెరిచి కలయచూసింది. ఆమెను తదేకంగా చూస్తున్న నన్ను గమనించి, కాస్త తత్తరపాటుతో రెండడుగులు వెనక్కి వేసి, తన రెండు చేతులతో జోలెను తెరచి ...

"బాబూ... ధర్మం!

బాబూ... ఆకలి...!"

ఎవరో గుండెమీద బాదుతున్నట్లుంది. ఆ దీనురాలి మాటల్లోని అర్థింపుకి.

ఏమిటి తల్లీ ఈ బాధ?

ఎందుకమ్మా నీ కీ అవస్థ? ఎక్కడ పుట్టావో, ఎలా పెరిగావో ... ఇన్ని దశల జీవితాన్ని ఎలా నెట్టుకుంటూ వచ్చావో, నా అన్నవారు నీకు లేరా! ఈ మరాఠీ దేశంలో ... ఎన్నాళ్లుగా జీవిస్తున్నావో ... రకరకాల ఆలోచనలు చుట్టుకుంటున్నాయి.

"అమ్మా ... ఎవరు తల్లీ నీవు, ఇంత గొప్పగా పాడుతున్నావు? నీ కెవరూ లేరా? నీవుండేది ఎక్కడ, తెలుగు పాట పాడుతున్నావు, తెలుగుదేశం నుండి వచ్చావా ... ముంబాయిలో ఎందుకున్నావు?" నా ప్రశ్నలన్నిటినీ విన్నదనే అనుకున్నాను ... కానీ నా మాటలేవీ తనకు అర్థం కానట్లు ...

తన రెండు చేతుల్ని లోతైన తన పొట్ట దగ్గరుంచుకుని "బాబూ ధర్మం .... బాబూ ... ఆకలి!"

నేను ఇంకా ఆశ్చర్యపోతూ చూస్తున్నాను. నా తెలుగు అర్థం కావటంలేదా? అర్థం అయి కూడా కానట్టు ప్రవర్తిస్తోందా?

ఒళ్లంత బొల్లు మచ్చలు. చింపిరి జుత్తు మొహంపైన వేలాడుతూండటం వలన ఆమె ఎలాంటి ఆకారంతో ఉందో ఊహించలేకపోతున్నాను.

ఆమెతో నేను మాట్లాడటం చూసిన అక్కడున్న మనిషి....

"ఆమె పిచ్చిది. తన కిష్టమైనప్పుడు ఏవో పాడుకుంటుంది. ఏదో లోకంలో ఉంటుంది. ధర్మం, ఆకలి తప్పించి రెండో మాట ఎప్పుడూ మాట్లాడదు!" హిందీలో తనకు తెలిసినంతమేరకు చెప్పి వెళ్లాడు.

ఎవరీమె...

ఎవరీ గాయని ...

ఎందుకీ దురవస్థ ... మెదడంతా ఇవే ప్రశ్నలు.

ఆమె అలా అడుక్కుంటూ మరికాస్త ముందుకు వెళ్లింది. నేనూ రెండడుగులు వేస్తూ ఆమెను వెంబడించాను.

ఎవరో ఆమె జోలిలో రెండు అరటిపళ్లు వేశారు.

ఆ రెంటినీ గబగబా ఒలుచుకుని క్షణాల్లో తినేసింది.

నన్ను గమనించనట్టుగానే ఒక దగ్గర కూర్చుని, తల గోక్కుంటూ, ఆవలించి, అలాగే నేలపైన ఒరిగి, ముడుచుకుపోయి పడుకుంది.

నేను ఆమెను మాట్లాడించబోవటం, అనుసరించటం చూసి అక్కడున్న కొందరు నాకేసి వింతగా చూడటం గమనించాను.

చూస్తూండగానే ఆమె నిద్రపోయింది.

ఆమెను అంతవరకూ గమనిస్తూ ఉండిపోయానే గానీ, కనీసం ఏమీ ధర్మం చేయులేకపోయానన్నది గుర్తుకు వచ్చింది.

ఎలా నిద్ర లేపటం?

మనసంతా చీకాకుగా తయారయింది. ఏదో అశాంతి ... ఎవరిపైనో కసి ... ఎందుకో తెలీని అస్పష్టమైన వ్యథ.

అలా చాలాసేపు ఆమె నిద్ర లేస్తుందని చూశాను. నా అశక్తతని తిట్టుకుంటూ ... ఇంకా అక్కడే ఉండి ఏం చేయాలో అర్థం గాక అన్యమనస్కంగా రైలెక్కి ఘట్‌కేసర్ చేరుకున్నాను.

హోటల్‌కు చేరేసరికి రాత్రి పదిదాటింది.

పడుకున్నానే గానీ ... కళ్లు మూతలు పడలేదు. దాదర్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపైన ముడుచుకుపోయి పడుకున్న ఆ దృశ్యం ... మరవలేకున్నాను.

తర్వాత రోజు ముంబాయిలోని రెండు మూడు ముఖ్య ప్రదేశాలు చూసి, ఆ మర్రోజు హుసేన్‌సాగర్ ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాదుకు వెళ్లడానికి ... ఘట్‌కేసర్‌లో హోటల్ ఖాళీ చేసి సాయంత్రం వరకంతా వి.టి. చేరుకున్నాం.

ఆ రెండ్రోజులూ ... ఆమె ఎక్కడైనా కనిపిస్తుందేమోనని వెతికినా ఎక్కడా అగుపడలేదు.

రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో రైలు కదులుతూండగా ... ప్లాట్‌ఫారంపైనున్న ఒక స్తంభానికి ఆనుకుని ఏదో పాడుకుంటున్న ఆమె కనిపించేసరికి ఏదో ఉద్వేగం తన్నుకొచ్చినట్లు గబగబా నా జేబులో ఉన్న చిల్లర డబ్బుల్ని గుప్పెటినిండా తీసి కిటికీలోంచి ఆమెవైపు వెదజల్లాను.

ఆ వెంటనే ఆపుకోలేని దుఃఖంతో అరి చేతుల్లో మొహం దాచుకున్నాను. నా ప్రవర్తనకి మా బాస్ నాకేసి విస్మయంగా చూస్తున్నాడు.

"అంత సెన్సిటివ్ అయితే ఎట్లాగయ్యా?" అతని మాటల మధ్య మరెవరి మాటలో అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

"ఆ ముష్టి ముసలిది ఎవరనుకున్నారు? నా చిన్నతనంలో గొప్ప గాయనిగా పేరు ఆమెకు. ఆమె పాటల్తో ఎన్నో గ్రామఫోన్ కంపెనీలు డబ్బులు గడించాయి. కొన్నేళ్ల క్రితమే మతిపోయింది. కొడుకు ఉన్నా ... ఆమెను చేరనివ్వలేదంటారు. ఇలా పాడుకుంటూ పొట్ట పోషించుకుంటోంది. ఆమె నా చిన్నప్పుడే మద్రాసు నుండి ఈ బొంబాయి చేరుకున్నట్లు గుర్తు ... పేరు స్వర్ణమాల అనుకుంటాను."

ఒక్కసారిగా స్తంభించిపోయాను.

"స్వర్ణమాల...!" అప్రయత్నంగానే నా పెదవులు ఉచ్చరించాయి.

మొదటిసారి రైల్లో విన్నప్పుడు నన్ను ఆ పాట ఎందుకలా వెంబడించిందో అర్థమవసాగింది.

'స్వర్ణమాల' నాన్న ఆరాధ్య దేవత ... ఆమె పాటలంటే పడిచచ్చేవాడు. నాన్నగార్కి ఈ విషయం తెలిస్తే ఎలా తట్టుకుంటారో?

స్వర్ణమాల గురించి తనకు తెలిసినంత మేరకు చెప్పుకుపోతున్నాడతను.

"ఆమె తన గాత్రంతో పేరునీ, డబ్బునీ సంపాదించింది. ఆమె సినిమా పాటలే గాక, ఎన్నో ప్రైవేటు గ్రామఫోన్ రికార్డులు ఇవ్వటం గుర్తు. ఆమెకు ఎనలేని కీర్తి, ధనం వచ్చేసరికి ఎక్కడ లేని బంధువులంతా రాబందుల్లా చుట్టుముట్టారు. సినిమావాడే- ఏ దర్శకుడో, నిర్మాతో పెళ్లి చేసుకున్నాడని అనుకునేవారు. ఆమె డబ్బుతో అతగాడు సినిమాలు తీయడం మొదలెట్టి, దివాళా తీసి, స్వర్ణమాలని అప్పుల్లో ముంచేసి జారుకున్నాడట. ఆ షాక్‌నుండి తట్టుకోలేక మతి భ్రమించిందని కొందరంటారు. ఆమెకున్న పేరును చూసి ఓర్వలేక ఎవరో ఏదో మందు పెట్టారనీ... ఎన్నో రకాల పుకార్లు నా చిన్నతనంలో వినేవాడ్ని. చివరికామె తన కొడుకుతోపాటేలా ముంబాయి వచ్చిందన్నారు. వాడు తల్లిని ఇక్కడ వదిలేసి ఎక్కడికో వెళ్లిపోయాడట. మరికొందరు వాడు చనిపోయాడంటారు. ఏది ఏమైనా ... చిల్లి గవ్వ ఆస్తి లేక, నా అన్న దిక్కులేక ... పోయిన మతితో, తనకు గుర్తున్నంత మేరకు ఏవో పాటల్ని తనకు తెలియకుండానే పాడుతూ ... పూనే-ముంబాయి స్టేషన్ల మధ్య తిరుగుతూ ..."

'హతవిధీ!' ఇంకా ఏం చెబుతున్నాడో వినాలనిపించలేదు.

ఒక గొప్ప గాయని జీవితం ... రైల్వే స్టేషన్ల మధ్యన!

వెంటవెంటనే గొప్ప గొప్ప కళాకారుల చివరి దశలు గుర్తుకు వచ్చాయి. కాష్టానికి డబ్బులు కావలసి, చందాలను వసూలు చేసిన సంఘటనలు ఉన్నాయి.

తమ జీవితాల్ని ... తమకు తాముగానైతేనేమి, ఇతరుల ప్రమేయంవల్లయితే నేమి ... ఛిద్రం చేసుకున్నా ... ఎంతైనా కళాకారులు కదా!

ఎంతోమంది వృద్ధ కళాకారులకి భృతిని కల్పిస్తున్నామంటున్న ప్రభుత్వాలకు,

ఓనమాలు రాని 'పేరున్న కళాకారులకు' డాక్టరేట్లు ప్రసాదిస్తున్న ప్రభుత్వాలకు ...

స్వర్ణమాల కనిపిస్తారా?

రైలు ముంబాయి నగరం దాటి తిమిరాన్ని చీల్చుకుంటూ వేగాన్ని పుంజుకుంది.

స్వర్ణమాల పాట నా చెవులకింకా వినిపిస్తూనే ఉంది. ■

### విరక్తి

"గత అయిదేళ్లుగా మిమ్మల్ని ఈ వ్యాధి పీడిస్తోందని తెలిసికూడా ఇంత కాలం మీరు ట్రీట్‌మెంట్ ఎందుకు తీసుకోలేదు?" ప్రశ్నించాడు డాక్టర్.

"నాకు ఇంకా కొన్నాళ్లు బతకాలని పించి..." జవాబిచ్చాడు పేషెంట్.

"మరిప్పుడు నా దగ్గరి కెందుకొచ్చినట్లో?"

"నిన్ననే జీవితంమీద విరక్తి కలిగింది..." చెప్పాడు పేషెంట్.

పి.వి. సుజాతారాయుడు,
సికిందరాబాదు